శిథిలావస్థలో ఆయుర్వేద మున్సిపల్ డిస్పెన్సరీ

- పెచ్చులూడిపోయి బయటపడిన ఐరన్ సువ్వలు
- వర్షాలకు తడిసి కంపు కొడుతున్న గోడలు
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి
- అందులోనే ప్రజలకు వైద్య సేవలు


విద్యాధరపురం మున్సిపల్ డిస్పెన్సరీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): శిథిలావస్థలో ఉన్న పురాతనమైన హాస్పటల్ భవనం భారీ వర్షాలకు గాలి తోడయితే కూలిపోయే పరిస్థితి. గత కొన్నేళ్ల నుంచి కురుస్తున్న వర్షాలకు హాస్పటల్ గోడలన్నీ చెమ్మగిల్లి, మరకలతో ముక్క కంపు కొడుతున్నాయి. అదే విధంగా భవనం శ్లాబ్ పెచ్చులూడిపోయి లోపల ఉండే ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఈ విధంగా పెచ్చులూడి పడిపోవడం నిరంతర ప్రక్రియ. శ్లాబ్ పెచ్చులు ఎప్పుడు తమ మీద పడతాయేనని అటు వైద్యుడు.. ఇటు వైద్యం కోసం హాస్పటల్ వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లోపలకు వెళ్లి బయటకు వచ్చే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉంటున్న దుస్థితి ఉంది. మొత్తం మీద పురాతనమైన హాస్పటల్ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని అయోమయ, ఆందోళనకర పరిస్థితి నెలకొంది. అదే గట్టు వెనుక ప్రాంతం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని నగరపాలక సంస్థకు చెందిన విద్యాధరపురం మున్సిపల్ డిస్పెన్సరీ (ఆయుర్వేద హాస్పటల్). ఆరోగ్యానికి భరోసా కలిపించాల్సిన నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ అధికారులు రోగుల ప్రాణాలకు భరోసా కల్పించ లేకపోకపోవడం గమనార్హం. ఈ హాస్పటల్ పక్కనే ఉన్న పన్నులు కట్టించుకుని చిన్న భవనం, దానికి ఆనుకునే నిరుపయోగంగా ఉన్న వ్యాయామ శాల (జిమ్), అలాగే ఆయుర్వేద హాస్పటల్‌కు అనుబంధంగా ఉన్న మలేరియా పరీక్షా కేంద్రం షెడ్‌లను కూల్చేసి జీ ప్లస్ టు భవనం నిర్మిస్తే అన్నింటికీ ఉపయుక్తంగా ఉంటుందని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేయటం, ఆయన వచ్చి పరిశీలించి వెళ్లటం జరిగాయి. కార్యాచరణకు ఎప్పుడు నోచుకుంటుందో వేచి చూడాల్సిందే.

ఆయుర్వేద హాస్పటల్స్‌లో వైద్యుల కొరత....

నగరం మొత్తం మీద 12 ఆయుర్వేద వైద్య చికిత్స కేంద్రాలలో వైద్యుల కొరత వెంటాడుతుంది. విద్యాధరపురం మున్సిపల్ డిస్పెన్సరీలో పని చేస్తున్న డాక్టర్ మరో రెండు హాస్పటల్స్‌కు ఇన్‌చార్జ్ వైద్యుడిగా ఉండటమే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఆయా వైద్య కేంద్రాల్లో పని చేసిన వైద్యులు కాలక్రమంలో కొందరు రిటైర్ అవుతుండగా వారి స్థానంలో కొత్తగా మరొకరిని నియమించకపోవడంతో ఒక డాక్టరే రెండు, మూడు హాస్పటల్స్‌కు ఇన్‌చార్జ్‌లుగా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మొత్తం 12 హాస్పటల్స్‌లో ఇద్దరు మాత్రమే శాశ్వత వైద్యాధికారులు ఉండగా, ఆరుగురు కాంట్రాక్ట్ బేసిస్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన నాలుగు హాస్పటల్స్ (కొత్తపేట, అజిత్‌సింగ్ నగర్, కృష్ణలంక, దుర్గాపురం)లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వ అనుమతి కోరుతూ స్థాయీ సంఘం ఆమోదం కోసం ఆఫీస్ సూచనను ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ముందు పెట్టారు. ఈ నేపథ్యంలో కొందరు వైద్యులకు అదనపు బాధ్యతలను అప్పగించటంతో ఆయా డిస్పెన్సరీలలో ఎక్కువ సమయం గడపలేక, రోగులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేక వైద్యులు అల్లాడిపోతున్నారు. అలాగే కుటుంబసభ్యులతో గడపాలన్నా, అనారోగ్యం చేసినా సెలవు దొరకక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వాస్తవానికి ఒక్కో డిస్పెన్సరీలో ఒక డాక్టర్‌తోపాటు నలుగురు సిబ్బంది ఉండాలి. ఒక మేల్ నర్సు, ఒక ఫిమేల్ నర్సు, కాంపౌండర్, వాచ్‌మెన్ ఉండాలి. అయితే ఏ డిస్పెన్సరీలోను పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఈ మేరకు ఆయా డిస్పెన్సరీలలో పని చేసే వైద్యులుకూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లుతున్న దాఖలాలుకూడా కనిపించటం లేదు. తెలియపరిచినా ఫలితం ఉండదని, ఆ మాత్రం దానికి తాము ఎందుకు చెడ్డ కావాలన్నది వారి భావనగా ఉన్నట్లు తెలుస్తోంది.

అనుబంధంగా మలేరియా హాస్పటల్.....

విద్యాధర పురం మున్సిపల్ ఆయుర్వేద డిస్పెన్సరీకు అనుబంధంగా దానికి ఆనుకుని ఉన్న మున్సిపల్ మలేరియా పరీక్షా కేంద్రం రేకుల షెడ్ కొంత వరకు పరవాలేదు. ఇందులోనే టీబీ పరీక్ష కేంద్రం కూడా ఉంది. వాటి రిపోర్టులను తీసుకుని డిస్పెన్సరీకి వెళితే అందుకు అవసరమైన మందులు (ఉంటే) అందజేస్తున్నారు. ఇదే రేకుల షెడ్‌లో స్థానిక శానిటరీ కార్యాలయంతోపాటు జనన, మరణ సబ్ రిజిస్టర్ కార్యాలయంకూడా ఉన్నాయి. సాయంత్రానికి ఇవన్నీ మూసేసి ఉండటంతో అక్కడ ఎవరూ సంచరించరు. దాంతో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కి చెందిన కొందరు అక్కడికి చేరుకుని తమ అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

క్లుప్తంగా

వన్‌టౌన్ పోలీస్ క్వార్టర్స్ పరిశీలన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలోని పురాతన క్వార్టర్స్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సీపీ రాజశేఖర్‌బాబు ఇతర అధికారులు శనివారం పరిశీలించారు. పోలీసుక్వార్టర్స్ చాలా సంవత్సరాలుగా మూతపడి ఉండటంతో ఆ ప్రాంగణం వృథాగా మారింది. ఈ నేపథ్యంలో ఎంపీ, సీపీలు కలిసి పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను కూల్చివేసి వాహనాల పార్కింగ్‌కి ఉపయోగపడే విధంగా నిర్మాణం చేపట్టాలని పోలీస్ కమిషనర్‌కు ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సారె సమర్పించిన దశావతార అమ్మవారి భక్త బృందం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌కు చెందిన దశావతార అమ్మవారి భక్త బృందం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శనివారం సారెను సమర్పించింది. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయం నుంచి వందలాది మంది దశావతార అమ్మవారి భక్తబృందం ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి బయలుదేరింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కొత్తపేట ఆంజనేయవాగు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా ఆలయానికి చేరుకున్నారు. ప్రధాల ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న బృందం సభ్యులు పోతిన విజయలక్ష్మీ, పిళ్లా మాధవి, పోతిన పుష్పలతలతో పాటు పలువురు భక్తులు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. అనంతరం ఆలయప్రాంగణంలో భక్తులకు అమ్మవారి సారె ప్రసాదాన్ని అందచేశారు. కార్యక్రమంలో పలువురు బృంద సభ్యులు పాల్గొన్నారు.

భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉపాధి అవకాశాలను అందించటంలో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రముఖ ఆంగ్ల విద్యావేత్త డాక్టర్ ఎ.సురేష్‌బాబు అన్నారు. కేబీఎన్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ఇంపార్టెన్స్ ఆఫ్ ఎఫెక్టివ్ ప్రజెంటేషన్ స్కిల్స్ ఫర్ ఇంటర్వ్యూస్' అనే అంశం మీద ప్రసంగ సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ అధునాత సాంకేతిక ప్రపంచంలో పోటీకి తట్టుకుని నిలబడటానికి విద్యార్థలతో పాటు భాషా నైపుణ్యాలు తప్పనిసరని చెప్పారు. కమ్యూనికేషన్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్, కాన్ఫిడెన్స్ బిల్డింగ్ టెక్నిక్స్, టోన్ అండ్ టైమింగ్ వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఆశావహ దృక్పథం, సానుకూల ధోరణి ఇంటర్వ్యూలో ఎంపిక కావటానికి అత్యంత అవసరమన్నారు. అధ్యాపకులు ఎస్.శాంతి, కె.రాధ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యుగంధరాచార్యకు అవార్డ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మై బ్రాండ్ బెటర్ సంస్థవారు ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా అందించే సౌత్ ఇండియా బెస్ట్ ఆస్ట్రాలజర్ అవార్డు ఈ సంవత్సరం డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు వరించినట్లు కూరపాటి చంద్రశేఖరరావు హైస్కూల్ కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు తెలిపారు. యుగంధరాచార్య గత 32 సంవత్సరాలుగా లక్షకు పైగా జాతక పరిశీలనలు చేసి ఎందరికో దిశా నిర్దేశం చేశారని పేర్కొన్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 1500 వందల నామినేషన్స్‌లో 2025 సంవత్సరానికి ఏకైక ఉత్తమ జ్యోతిష్కులుగా గుర్తించి సౌత్ ఇండియా బెస్ట్ ఆస్ట్రాలజర్ అవార్డును ఆ సంస్థ ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఇటీవల బెంగళూరులో శ్రీ పుత్తన్న చెట్టి టౌన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి జయప్రద చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న యుగంధరాచార్యను తమ పాఠశాల సిబ్బంది అభినందించినట్లుగా ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ పశ్చిమ క్లస్టర్ కమిటీలు నియామకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ క్లస్టర్లకు సంబంధించిన కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనను విడుదల చేసింది. క్లస్టర్-1కు సంబంధించి ఉపాధ్యక్షులుగా పట్నాల రవికుమార్, పిడుగు సాల్మన్‌రాజు, ప్రధాన కార్యదర్శులుగా నరపత్‌సింగ్, మంటి రాము, గద్ద రమేష్, కోశాధికారిగా రుద్ర శంకర్, కార్యదర్శులుగా వక్కలగడ్డ కుమార్, షేక్ ఫారూక్, కుత్తి హరిప్రసాద్, తురికొండ ఫణికుమార్, వల్లం రవికుమార్‌తో పాటుగా పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమించారు. అలాగే క్లస్టర్ -2కు సంబంధించి ఉపాధ్యక్షులుగా కె.శివ, షేక్ సలీమ్ (గోరు), ప్రధాన కార్యదర్శులుగా డేరంగుల మహాలక్ష్మి, శీరంశెట్టి దుర్గాప్రసాద్, సయ్యద్ రఫీ, కోశాధికారిగా వరసల సునీల్, కార్యదర్శులుగా ఏనుబేరు నాగరాజు, ఆకుల రాజు, సమద్, షేక్ రేష్మా, జంగం అనీల్ కుమార్, దొడ్డ సురేష్ పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. క్లస్టర్-3కు సంబంధించి ఉపాధ్యక్షులుగా లక్కు రామచంద్రారెడ్డి, కనకం వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా పఠాన్ రసూల్‌ఖాన్, అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, నల్లం వాసు, కోశాధికారిగా కేసరి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శులుగా జంగం ఆనందకుమార్, ఉడుముల శివశంకర్‌రెడ్డి, గండి రంగనాయకులరెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, సరగడ సత్యనారాయణరెడ్డి, బైపినేని కోటేశ్వరరావు పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.క్లస్టర్-4కు సంబంధించి ఉపాధ్యక్షులుగా దాసిన ఏసు, గాలి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా బంకా రమణ, బెవర చిన్నా, సూర వెంకటరావు, కోశాధికారిగా పట్నాల అప్పన్న, కార్యదర్శులుగా షేక్ వలీ, ఆళా రాజకుమార్, షేక్ బడే, షేక్ మదీనా, షేక్ అదిల్‌అలీ, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. క్లస్టర్ -5కు సంబంధించి ఉపాధ్యక్షులుగా జమ్మలమూడి మార్క్, తాతపూడి చంద్రశేఖర్, బాయన కుమార్ ప్రధాన కార్యదర్శులుగా బాడితబోయిన రాము, ముదిలి ప్రసన్న కుమార్, ఎండీ ఖాజా కోశాధికారిగా దుర్గాసి కోటేశ్వరరావు, కార్యదర్శులుగా పూర్ణ సతీష్‌రాజు జార్జ్, చేపూరి వినోద్‌కుమార్, ఎస్‌కే రవూఫ్, పోట్నూరి సునీల్, వి.భరత్, పలువురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

నగరంలో కొత్త పార్కులు నిర్మించండి

కమిషనర్ ధ్యానచంద్ర


వీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కొత్త పార్కులను నిర్మించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో శనివారం వివిధ శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దాలని చెప్పారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఇంటి వద్ద సేకరించడమే కాకుండా వాటిని జిందాల్‌కి తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గార్బేజ్ తరలింపు వాహనాలను సద్వినియోగం చేస్తూ నగరంలో పరిశుభ్రత పెంచాలని సూచించారు. నగరంలో కొత్త పార్కులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తులన్నీ స్ట్రక్చరల్ స్టెబిలిటీను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎస్టేట్ అధికారుల సమన్వయంతో పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి. సత్యనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ ఎస్‌వీకే చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జె. శ్రీనివాస్, సురేఖ, సామ్రాజ్యం, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చంద్రశేఖర్, ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

సారె సమర్పణకు తరలివస్తున్న భక్త బృందాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు విశేషంగా ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఉదయం 8 గంటల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్త బృందాలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నాయి. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని దర్శించుకుని సారెను సమర్పించాయి. సారె సమర్పణకు విచ్చేసిన భక్త బృందాలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు.

ఆలయ ప్రాంగణంలో భక్తులకు, తమ తోటి బృంద సభ్యులకు సారె ప్రసాదాలను అందచేస్తున్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన సారె సంబరం సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది.

స్వయం ఉపాధికి ఫిక్కీ ఫ్లో శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూగ, బధిర విద్యార్థులు, మహిళలు స్వయం ఉపాధి పొందేలా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్, సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమృత కుమార్ మాట్లాడుతూ మూగ బధిర మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో మూడు నెలల శిక్షణ ప్రారంభించామని చెప్పారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లో నైపుణ్యాన్ని పెంపొందించి, స్వయం ఉపాధి ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఫిక్కీ ఫ్లో ఇనీషియేటింగ్ హెడ్ విజయలక్ష్మి మాట్లాడుతూ మూగ, బధిర విద్యార్థులు, మహిళలు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన తరువాత స్వయం ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. దానికి ఫ్లో ద్వారా సహకారాన్ని అందిస్తామని చెప్పారు. శిక్షణలో భాగంగా గూగుల్ స్కెచప్, ఆటోక్యాడ్, ఎంబ్రాయిడరీ, టై అండ్ డై, స్క్రీన్ ప్రింటింగ్ నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ సీనియర్ వైస్ చైర్మన్ సుప్రియ మల్లినేని, వైస్ చైర్మన్ రజిని చిత్ర, కార్యదర్శి సుమబిందు అట్లూరి, సంయుక్త కార్యదర్శి దీప్తి చలసాని, కోశాధికారులు దేవినేని తులజా భవాని, అనిలా నారియా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందాలి

కొనసాగుతున్న రథయాత్ర ఉత్సవాలు


ఇస్కాన్ జగన్నాథ మందిరంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు





భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం సీతమ్మవారి పాదాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుండిచ మందిరంలో ఉదయం బ్రహ్మముహూర్తంలో మంగళ హారతితో మొదలయ్యాయి. అనంతరం భగవంతునికి అద్భుత అలంకరణ, ప్రభుపాద గురు పూజ నిర్వహించిన తరువాత ఇస్కాన్ జీబీసీ శ్రీమాన్ రేవతి రామన్ ప్రభుజి శ్రీమద్భాగవత ప్రవచనం చేశారు. జగన్నాథుని మహాప్రసాదాన్ని ఏ భావంతో స్వీకరించాలి, తద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం ఎలా పెంపొందుతుంది వంటి విషయాలను సరళమైన భాషలో వివరించారు. మధ్యాహ్న హారతి, హరినామ సంకీర్తనలు జరిగాయి. సాయంత్రం కూచిపూడి నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ముఖ్యంగా పండాల్ తరహాలో స్వామివారి రథం చుట్టూ 108 సార్లు తిరుగుతూ హరేకృష్ణ మంత్రం జపించారు. కాగా కోస్టల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ సహ సమర్పణలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా సెంటర్ రామరాజ్యనగర్ కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ కూలి నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎండీ మస్తాన్, స్థానిక నాయకులు అప్పలరాజు, ఎన్ గురప్ప, వెంకటరమణ, చంటిలతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ గుర్రం అప్పారావు ఇంటి వద్ద రిటైనింగ్‌వాల్, కొండ చరియలు విరిగిపడి మల్లంపాటి బాబూరావు బిల్డింగ్ గోడ, అల్లూరమ్మ రేకుల షెడ్ ధ్వంసం కావడంతో వారు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు పడిపోయిన రిటైనింగ్‌వాల్‌ను పునర్నిర్మాణం చే యాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పె ట్టుకుని కొండ ప్రాంతంలో కొండ చరియలు జారి పడకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఏఐతో గుండె రక్తనాళాల్లో పూడికల గుర్తింపు

కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు


సీఎంఈని ప్రారంభిస్తున్న జయరాం పాయ్, డాక్టర్ రమేష్‌బాబు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె రక్తనాళాల్లో పూడికలను (ప్లాక్) సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ ద్వారా గుర్తించే విధానం 2021 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక నిర్ధయాత్మక పరీక్షగా పరిగణిస్తున్నట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె వైద్యంలో విప్లవాత్మక మార్పులపై నిరంతరం వైద్య విద్య సదస్సు శనివారం నిర్వహించారు. ఉభయ కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల వైద్యులు పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గుండె వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను వివరించారు. సీటీ యాంజియో వల్ల క్యాథ్ యాంజియోగ్రామ్ రెండో నిర్ధయాత్మక పరీక్షగా మారిందని చెప్పారు. దాదాపు 80 శాతం కేసుల్లో క్యాథ్ యాంజియోగ్రామ్ అవసరం తగ్గిందని వివరించారు. తమ హాస్పిటల్స్‌లో నిర్వహించిన 26 వేల సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ పరీక్షలను అల్గారిథం ఆధారంగా క్రోడీకరించి, వ్యాధి నిర్ధారణ చికిత్స సిఫార్సుల్లో గణనీయమైన పురోగతిని సాధించినట్లు వెల్లడించారు. ఈ సదస్సులో డాక్టర్ జయరాం పాయ్, డాక్టర్ శివ ప్రసాద్ గుండె శస్త్ర చికిత్సల గురించి వివరించారు. ఈ సదస్సులో హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ, ఆడపడుచులు వేధిస్తున్నారంటూ వివాహిత భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొల్లపూడి సత్యనారాయణ వీధికి చెందిన నూనె లీలావతికి ప్రదీప్‌తో 2024 ఫిబ్రవరిలో వివాహమైంది. ఆ సమయంలో కట్నం, ఇతర ఖర్చులు కలిపి రూ. 42 లక్షలు ఖర్చయింది. మూడు నెలల పాటు వీరి సంసారం బాగానే సాగింది. ఆ తర్వాత భర్త ప్రదీప్, అత్త పద్మావతి, నరసింహారావు, ఆడపడుచు ప్రత్యూష, ఆమె భర్త శ్రావణ్‌లు లీలావతిని వేధించసాగారు. ఆమెకు అనారోగ్యం ఉందని, పిల్లలు పుట్టరని, మందులు వాడాలంటూ ఒత్తిడి తెచ్చారు. సూటిపోటి మాటలతో వేధిస్తున్నారు. భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేరే సంబంధం చేసుకుంటే అదనంగా కట్నం వచ్చేదని ఆమెను ఇబ్బందులకు గురి చేశారు. ఉద్యోగ రీత్యా కొంత కాలం కిందట హైదరాబాద్ వెళ్లారు. అక్కడా అవే వేధింపులు చేయసాగారు. హైదరాబాద్ వెళుతూ ఈ ఏడాది మార్చి 2న రాయనపాడు రైల్వే స్టేషన్‌లో వదిలివేసి వెళ్లాడు. అప్పటి నుంచి లీలావతి పుట్టింట్లోనే ఉంటుంది. ఈ సమయంలో విడాకుల కావాలని కోర్టు నోటీసులు పంపాడు. భర్త, అత్తమామల వేధింపుల తాళలేక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వడ్డీ పడకుండా పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు వీఎంసీకి చెల్లించే వివిధ పన్నులు వడ్డీ పడకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీనే ఆఖరు గడువని కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రైనేజ్ పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించాలని సూచించారు. వడ్డీ పడకుండా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

5 నుంచి పాండురంగడి కల్యాణోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో కొలువై ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి కల్యాణోత్సవాలు జూలై ఐదు నుంచి ఏడో తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఐదో తేదీన ఆలయంలో కొలువై ఉన్న రుక్మాబాయి పాండురంగస్వామి వార్లకు సంతాన వేణుగోపాల స్వామి వార్ల మూలమూర్తులకు పంచామృత తిరుమంజన అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వార్లకు నూతన వస్త్ర సమర్పణ, పెండ్లి కుమారునిగా అలంకరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం ప్రత్యేక ఊంజల్ సేవ నిర్వహిస్తారు. ఆరో తేదీన ఉదయం స్వామి వారికి తొలి ఏకాదశిని పురస్కరించుకొని మూలమూర్తులకు పంచామృత తిరుమంజన అభిషేకాలను నిర్వహిస్తారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేస్తారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఏడో తేదీన ఉదయం స్వామి వారికి తులసీదళార్చనను నిర్వహిస్తారు. సాయంత్రం సమస్ర దీపాలంకరణ, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వివరించారు.

సెప్టెంబరు 21న జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 21వ తేదీన తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కె.ఎన్.ఎస్.ప్రసాద్ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రైవేట్ పాటల వీడియోల పోటీలు, రీల్స్ పోటీలు జరుగుతాయన్నారు. షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5వేలు, ప్రైవేట్ పాటల వీడియోల పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, అలాగే రీల్స్ పోటీలలో మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి వెయ్యి రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ లోగా షార్ట్ ఫిల్మ్ గాని, ప్రైవేట్ పాటల వీడియో గాని, రీల్స్ గాని పంపాలని కోరారు. ఈ సమావేశంలో షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీవీ రాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్ ఆనంద్ కొప్పుల, వర్కింగ్ సెక్రటరీ బి.అశోక్, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.